## నవ్వితే రత్నాలు రాలే ఆ సుందరి రాజ్యాన్ని ఎలా కాపాడింది?

# గోపిశ్రీ కథ

## రత్నగంధి

రాయలసీమలోని తుంగభద్ర, కృష్ణ నదులు కలిసే పుణ్యభూమిని పరిపాలించే రాజు కరుణ వర్ధనుడు. అతని రాజ్యపాలనలో కందనవోలు కరువు కాటకాలు లేకుండా సుభిక్షంగా వుండేది. కందనవోలు దేశంలో రత్నగంధి అనే యువతి ఉండేది. దైవాంశ సంభూతురాలైన ఆమెకు యుక్తవయస్సు రాగానే దేవతల కటాక్షంవల్ల నవ్వితే నవ రత్నాలు రాలే వరప్రసాదిని అయింది. కందనవోలు మహారాజు కరుణవర్ధనుడు ఆమె ప్రతిభను విని పరవశత్వం పొందాడు. అటు వంటి వరపుత్రి తమ దేశంలోనే కాకుండా ఏ దేశంలోనూ వుండదనుకున్నాడు. ఆరోజుల్లో ప్రవళ దేశపు రాజయిన మలయసింహుడు అంటే భయపడిపోయేవాడు. ఏదోవాడు ప్రవళదేశపు రాజు తమ దేశంపై దండెత్తి వచ్చి తనని జయించివేస్తాడని భావించేవాడు. దానికి కారణం ప్రవళ దేశపు రాజుకు కుడిభుజమైన అంగరక్షకుడు మహామయుడే!

అతడు బాహుబల పరాక్రమవంతుడే గాక సమస్త అస్త్రశస్త్ర పారంగతుడు కూడా. అందంలోనూ నవమన్మథుడే! — అతడు రాజుకు అంగరక్షకుడిగా వున్నంతకాలం ఈ భూప్రపంచంలో రాజా మలయసింహుని జయించడం అసాధ్యం.

అందుకని కందనవోలు రాజు కరుణవర్ధనుడు ఎప్పటికప్పుడు ఏదో ఒక విధంగా అమూల్యమైన కానుకల రూపేణ ప్రవళదేశం రాజుకు పంపిస్తుండేవాడు.

నవ్వితే నవరత్నాలు రాలే రత్నగంధి తన



తల్లిద్వారా రాలిన రత్నాలను తమ దేశపు రాజైన కరుణవర్ధనుడికి భక్తితో పంపేది. రాజు ఆమె రాజభక్తికి పరవశం పొందినవాడై ఆమె తల్లి కృష్ణవేణమ్మను సకల మర్యాదలతో సత్కరించి గౌరవించేవాడు.

"రత్నగంధి గొప్ప ప్రతిభా వంతురాలే కాకుండా మంచి అందగత్తె కూడా! ప్రవళ దేశపురాజు మలయసింహుడు ఆమెను

చూస్తే పరమానందం పొందవచ్చును. చాలాకాలం వరకు మనమంటే సహృద్భావం కలిగి యుండవచ్చు. మనం రత్నగంధిని ప్రవళదేశపు రాజుకు కానుకగా సమర్పిస్తే ఇక ఆ రాజువల్ల మనకెలాంటి ప్రమాదమూ ఉండబోదు'' అన్నాడు కరుణ వర్ధన మహారాజుతో మహామంత్రి విజయవర్మ.

''అవును మహామంత్రీ! మీ ఆలోచన సమంజసమైనది. నేను ఈ విషయాన్నే మనసులో పదేపదే అనుకున్నాను. మీరు కూడా దూరదృష్టితో ఆలోచించి సెలవిచ్చారు. చాలా సంతోషం'' అన్నాడు కరుణవర్ధనుడు నవ్వుతూ.

తనని ప్రవళదేశానికి కానుకగా పంపుతున్నట్లు రత్నగంధికి తెలిసింది. ఇంతకంటే ఘోరం మరెక్కడా వుండదనిపించింది.

'ఏది ఏమయినా తాను కందనవోలును వదిలి వెళ్లకూడదని నిశ్చయించింది. బలవంతాన తనని ప్రవళదేశం పంపే పక్షంలో నవ్వకపోవడం అలావుంచి, పిచ్చిపిచ్చి పనులు అనేకం చేసి పిచ్చిదాన్ని బహుమతిగా పంపినట్లు ఆ రాజుకు అభిప్రాయం కలిగిస్తానని కందనవోలు రాజును బెదిరించింది.

రత్నగంధిని ఏమి చేయాలో బోధపడని కరుణవర్ధనుడు ఆమెను సామ దాన భేదాలతో బెదిరించి చూశాడు. తల తీయిస్తానని భయపెట్టాడు. అయినా రత్నగంధి చలించలేదు.

ఆమె తల్లి కృష్ణవేణమ్మను పిలిపించాడు. ఆమె పూలమాలలు కట్టడంలో నిపుణురాలు. మహారాజు విషయమంతా ఆమెతో చెప్పి ''నీవు రత్నగంధిని వొప్పిస్తే నీకు కోరినన్ని పరగణాలు బహుమతిగా ఇస్తాను'' అన్నాడు.

''నేనలా చేయను. ఆమెను ఒక అయ్య చేతిలో పెట్టి ఇంటిదాన్ని చేయాలని ఆశపడుతున్నాను. కావాలంటే నన్ను చంపండి'' అంది కృష్ణవేణమ్మ తెగింపుగా.

కందనవోలులో రత్నగంధి గురించి జరుగుతున్న అల్లరి, ఎలాగో ప్రవళదేశపు రాజుకి తెలిసింది. రత్నగంధికి జన్మభూమిపై గల మక్కువ, రత్నాలను కూడా లెక్కచెయ్యకుండా తన దేశపు రాజుకు సమర్పించే రాజభక్తి, ఆమె పట్టుదల, ప్రవళదేశపు రాజును ముగ్ధుడ్ని చేశాయి. ఒకసారి ఆమెను చూడాలని అతడికి కోరిక కలిగింది. వెంటనే తన కుడిభుజమైన అంగరక్షకుడు మహామయుడ్ని వెంట బెట్టుకుని మారువేషాల్తో కందనవోలు చేరుకున్నారు.

రత్నగంధి పూలసజ్జ పట్టుకొని ఆలయానికి వెళ్తుండగా ఆమెని పొంచి చూశారు. అంగరక్షకుడైన మహామయుడు ఆమె అందానికి అప్రతిభుడయ్యాడు. అతని హృదయం చలించినట్లయింది. ఇంతటి అపురూప లావణ్యవతి తనకి భార్య అయితే తన జీవితం ధన్యం... అనుకున్నాడు. ప్రక్కనే మహారాజు వుండడంచేత మహామయుడు మౌనముద్ర వహించాడు.

ఇరువురు ఆమె ఇంటి పరిసరాల్లో తిరుగుతూ గమనించసాగారు. మహారాజు హృదయంలో రత్నగంధి చెరగని ముద్రగా

నిలిచిపోయింది. ఇంతటి వరపుత్రిని తన రాజ్యంలో వుంచుకోవాలన్న కోరిక ప్రబలమైంది. ఏదయితే అదవుతుందని ప్రవళదేశపు రాజు రత్నగంధి ఇంటి తలుపు తట్టాడు.

ప్రవళదేశపు మహారాజు మలయసింహుడు తన చేతికి వున్న రాజముద్రికను చూపించి తాను ప్రవళదేశపు మహారాజునని, తన వెంటనున్నది తన అంగరక్షకుడని, రెండురోజుల పాటు వాళ్లింటో తమకు ఆతిథ్యం ఇవ్వవలసిందిగా కోరాడు.

మహామయుని శక్తిసామర్థ్యాలు ప్రత్యక్షంగా చూడకపోయినా వేనోళ్ల వినియున్న రత్నగంధి అతనివంక కనురెప్పపాటు గమనించిన ఆమె నేత్రాలు సిగ్గుతో ఎరుపుగా ముడుచుకున్నాయి.

ప్రవళదేశపు రాజు గురించి అదివరకే విన్నందున వెంటనే వారిని లోపలికి వినయంగా ఆహ్వానించి, కూర్చునేందుకు వుచితాసనాలు చూపించింది. తరువాత తల్లిని వెంటనే ఆలయ ప్రాంగణం నుండి రావలసిందిగా కబురుపంపింది.

కృష్ణవేణమ్మ ప్రవళదేశపు రజుని చూచి ఆశ్చర్య చకితురాలైంది. మహదానందంతో ''మీరు ఏమి కోరుతున్నారో చెప్పండి. అతిథులుగా మీ కోరిక తీర్చడం మా కర్తవ్యం!''అంది కృష్ణవేణమ్మ వినయంగా.

మాట తప్పనట్లుగా ఆమెతో హామీ తీసుకుని రత్నగంధిని తమతో పక్షం రోజులు తన కోటకు వచ్చి ఆతిథ్యం తీసుకోవాలని కోరాడు. ఆ కోరికలో అసమంజసం ఏదీవున్నట్లు కృష్ణవేణమ్మకు కనిపించలేదు. రత్నగంధి పక్షమురోజుల ప్రవళదేశం వెళ్లి వచ్చేందుకు ఒప్పుకుంది. అయితే రత్నగంధి మాత్రం ససేమిరా వొప్పుకోలేదు.

''రానని అంటే బలవంతం లేదు. అయితే ఎందుకు రావడంలేదో కారణం చెబితే సంతోషిస్తాను'' అన్నాడు మలయసింహుడు.



"మహారాజా! మేము మా దేశపు రాజుకి విధేయులం. మా దేశపు అతిథిగా మారాజు మీ దేశానికి పంపితే నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. మా రాజుకు తెలియకుండా నేను పరదేశం గడ్డలో అడుగు పెట్టడం తప్పు. క్షమించండి. నా తల్లిగారిని అడిగినట్లే మా దేశపు రాజుని కూడా అడగండి. ఆయన అంగీకరిస్తే నేనభ్యంతరం చెప్పను" అంది రత్నగంధి.

ప్రవళదేశపు మహారాజు కాసేపు ఆలోచించి మాట్లాడకుండా అంగరక్షకుడితో మౌనంగా తన దేశం వెళ్లిపోయాడు. తరువాత తాను కందనవోలు రాజ్యంపై దండెత్తివస్తున్నట్లు కరుణవర్ధనుడికి పంపాడు.

కందనవోలు మహారాజు కంగారుపడి "దండెత్తే ఆగ్రహం వద్దు. మానుండి ఏం కావాలంటే అది వెంటనే పంపిస్తాం!" అని జవాబు పంపాడు.

ఇంతలో కందనవోలు రాజుకి, ప్రవళదేశపు రాజు అతని అంగరక్షకుడు మారువేషాల్లో వచ్చి రత్నగంధిని కలుసుకున్నట్లు తెలిసింది. రత్నగంధిని పిలిపించి జరిగింది తెలుసుకున్నాడు కరుణవర్ధనుడు. ఆ తరువాత మహామంత్రి విజయవర్మని పిలిచి సలహా అడిగాడు.

"మహాప్రభూ! కందనవోలు దేశమని, ప్రవళదేశమని రెండు రాజ్యాలుగా వున్నంతకాలం ఎప్పుడు రత్నగంధిని రప్పించుకోవాలన్నా, ఆ రాజు మీ అనుమతి పొందుతుండాలి. కందనవోలును తన రాజ్యంలో కలిపేసుకుంటే రత్నగంధి తన దేశస్థురాలే అవుతుంది అది రాజుయొక్క అభిప్రాయం" అన్నాడు మంత్రి.

కందనవోలు రాజు వెంటనే ప్రవళదేశపు రాజుకు లేఖను పంపుతూ, అందులో ప్రవళదేశపు రాజు గనుక కందనవోలుపై దండెత్తివస్తే అతడికి రత్నగంధిని దక్కకుంటే ఆమెను చంపివేస్తానని, రత్నగంధి కావాలనుకుంటే యుద్ధం మానమని, రత్నగంధిని శాశ్వతంగా ప్రవళదేశం పంపే బాధ్యత తనదని వ్రాశాడు.

"రత్నగంధి దేశభక్తిగల యువతి. నాపై అలిగి ఒక దేశ భక్తురాలిని సంహరించడం జరిగితే నా దేశప్రజలు నీవు ఓడినందుకు ఆనందించి వేడుకలు చేసుకుంటారు. అంతేగాక నీలాంటి వారి రాజ్యంలో దేశభక్తి ఎందుకని ప్రవళదేశం పొరుగునే వుండిపోయేందుకు నిశ్చయులవుతారు. ఇది ఆలోచించి ఓడిపోయాక ఆమెను చంపితే చంపు. నేను మాత్రం యుద్ధం మానను" అని ప్రవళదేశపు రాజు తిరిగి లేఖను పంపాడు.

కందనవోలు రాజుకు ఏమి చేసేందుకు తోచలేదు. రత్నగంధిని పిలిపించి ఆ లేఖను చూపించి యుద్ధము జరక్కుండా తరుణోపాయం చెప్పమన్నాడు.

"క్షమించండి మహారాజా! నావల్లే ఈ ఉపద్రవం వాటిల్లడం శోచనీయంగా వుంది. మీరు మా కుటుంబం గురించి పూర్తిగా తెలిసినవారు. మీ తండ్రిగారి హయాంలో మా నాన్నగారు ఒక సందర్భంలో వారిని

రక్షించి ప్రాణాలు సహితం కోల్పోయారు. అందుకు మేము విచారించలేదు. మీ మనక్షోభము నేను అర్థం చేసుకోగలను. అయినా నాదొక సలహా! మీకెలాగూ సంతానయోగం లేదు. నామాట కాదనకుండా నన్ను మీ కూతురిగా దత్తత చేసుకుంటే ఈ సమస్య పరిష్కారం కాగలదు'' అంది వినయంగా రత్నగంధి.

రాజు ఆశ్చర్యపడుతూ ''అదెలా సాధ్యం? నిన్ను నా కూతురిగా స్వీకరిస్తే యుద్ధం ఆగిపోతుందా? చాలా విచిత్రంగా వున్నాయి నీ మాటలు'' అన్నాడు కరుణావర్ధనుడు అయోమయంగా.

''అవును మహారాజా! మీరు గనక నన్ను కూతురిగా స్వీకరించి వెంటనే నా పెళ్లికి స్వయంవరం ప్రకటించండి. మల్లయుద్ధంలో విజయం సాధించిన వీరునికి కుమార్తెతో పాటు సంపూర్ణరాజ్యాన్ని కూడా ఇస్తున్నట్లు ప్రకటన చేయండి. ఆరోజున పోటీకి వచ్చేవాళ్లలో ప్రవరదేశపు రాజుగారి అంగరక్షకుడైన మహామయుడు కూడా తప్పక హాజరవుతాడు. విజయం సాధిస్తాడు. అతడు రాజయితే సమస్త రాజ్యాలను కైవశం చేసుకుని మిమ్మల్ని రారాజుని చేస్తాడు. ఇది అతడికి అసాధ్యమైన పనేమాత్రం కాదు. ఆలోచించండి'' అంది రత్నగంధి.

ఆమె ఆలోచనకు మహారాజు పొంగిపోయాడు. వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలన్న సిద్ధాంతం తెలిశాక వెంటనే రత్నగంధిని శాస్త్రోక్తంగా తన కుమార్తెగా స్వీకరించాడు. రత్నగంధి రాకుమారి అయింది.

సమస్త రాజ్యాలకు ఆహ్వానాలు పంపినట్లే ప్రవరదేశపు వీరులకు కూడా ఆహ్వానం పంపబడింది. ఈ హఠాత్పరిణామానికి కొంత ఆశ్చర్యపడినా ఏదోవిధంగా మహామయుడి ద్వారా రత్నగంధితోపాటు కందనవోలు రాజ్యాన్ని తన రాజ్యంలో కలిసిపోగలదన్న ఆలోచనకి పొంగిపోతూ మహామయుడ్ని ప్రోత్సహించి విజయంతో తిరిగి రమ్మని ఆదేశించి మల్లయుద్ధం పోటీలకు పంపాడు.



## ఉత్తరం

ఉత్తరం గట్టిగా చదువుతున్న పరశురాం చెవుల్లో దూది వుంది. అది చూసి

''చెవుల్లో దూది పెట్టుకున్నావ్ ఏమయింది?'' తట్టి అడిగాడు ఆత్మారాం.

''ఏం లేదు... ఇదిగో ఈ పుల్లయ్యకి కోడలి దగ్గర్నుండి వుత్తరం వచ్చింది... కాస్త చదివి పెట్టమన్నాడు'' చెప్పాడు పరశురాం.

''చదవడానికి చెవుల్లో దూదెందుకు?''

''కోడలు ఏం రాసిందో నాకు వినపడ్డం ఇష్టంలేదు ఈ పుల్లయ్యకి'' చెప్పాడు పరశురాం.

జి.వెంకటి (నిజామాబాద్)

స్వయంవర ఆహ్వాన ప్రకటనలు అందుకొన్న సమస్త రాజ్యాలనుండి రాజకుమారులు, మంత్రి కుమారులు, సైన్యాధిపతులు, అంగరక్షకులు తదితర యోధానుయోధులు తమ భుజబల పరాక్రమాలను ప్రదర్శించేందుకు కందనవోలు రాజ్యంలో పోటీకి హాజరయ్యారు.

పోటీలు న్యాయపరిధిలో జరిగాయి. ఊహించిన రీతిలో ప్రవళదేశపు రాజు అంగరక్షకుడైన మహామయుడు విజయం సాధించాడు. రత్నగంధి పరమానందంతో అతన్ని విజయమాలతో అలంకరించింది. మహామయుడు కందనవోలు రాజ్యానికి రాజయ్యాడు.

మహామయుడు ఆనందోత్సాహాలతో తనదైన రత్నగంధిని చేరి "నాకు కలిగిన ఈ విజయానికి చిహ్నంగా ఏమయినా వరం కోరుకో. నీ కోరికను తప్పక తీరుస్తాను" అన్నాడు.

"మాట తప్పరు కదా!? — ఇప్పుడు మీరు మహారాజులు. సర్వస్వతంత్రులు. మీ బానిస బ్రతుకు నేటితో అంతరించింది. మీ శక్తిసామర్థ్యాలు మరోమారు ప్రదర్శించుకునే కాలం వచ్చింది. ఇక నా కోరిక అంటారా?... ప్రవళదేశపు రాజు మలయసింహుని తల నరికి నాకు కానుకగా ఇవ్వండి. అంతేకాదు సమస్త రాజ్యాలతో యుద్ధం చేసి చక్రవర్తిగా కీర్తి సంపాదించండి. నా తండ్రిగారయిన కరుణవర్థనులు శక్తి వున్నంతవరకు రాజ్యభారం వహిస్తారు. ఆ పై చక్రవర్తులుగా మీరే వారసులవుతారు."

రత్నగంధి తన అంగరక్షకుడైన మహామయుడిని వివాహమాడిందని, పెళ్లికానుకగా ప్రవళదేశపు రాజు తల తీసుకొచ్చి ఇవ్వవలసిందిగా అడిగిందని విన్నాడు ప్రవళదేశపు రాజు మలయసింహుడు. కథ అడ్డం తిరిగినందుకు ఎంతగానో విచారించాడు. అయినా యుద్ధం తప్పలేదు.

మహామయుడి యుద్ధనైపుణ్యం, సమర్థత, బుద్ధికుశలత తెలిసివున్నందున ప్రక్కనవున్న రాజ్యసేనల బలగంతో రెట్టింపు సైన్యాన్ని ముందుకు పంపాడు. పోరు అతిభయంకరంగా జరిగింది. ఎంతో సైన్యం నష్టం జరిగినప్పటికీ మహామయుడి పరాక్రమం, యుద్ధనైపుణ్యం కారణంగా మరెంతో నేర్పుగా సైన్యాన్ని ప్రోత్సహించి వీరోచితంగా పోరాడి రాజు సేనలను తరిమికొట్టాడు.

అపజయము తప్పదని ఊహించిన మలయసింహుడు మరికొంత సైన్యాన్ని, అశ్విక దళాలను, గజ బలాలను తరలించుకొని కదనరంగం చేరాడు. కత్తులు కటీలుమన్నాయి. యుద్ధసమయంలో సైనికులు అవలంభించే కొన్ని పాతవ్యూహాలు, ఎత్తుగడలతో వీరోచితంగా ప్రాణాలు ఒడ్డి పోరాడినా ప్రవళదేశపు రాజు చిత్తుగా ఓడిపోయాడు. మహామయుడు అతని తల నరికి రత్నగంధికి బహుమతిగా ఇచ్చాడు.

తర్వాత పక్షము రోజులు తిరక్కుండానే

ఒక మంచి ముహూర్తాన ప్రకవదేశాన్ని తన రాజ్యంలో కలుపు కున్నాడు. సైనికులకు మంచి శిక్షణ ఇచ్చాడు. విదేశీయులు అనుసరించే ఆధునిక యుద్ధ పద్ధతులను ప్రవేశపెట్టాడు. మేలుజాతి గుర్రాలను, ఏనుగులను, ఒంటెలను, కొన్ని సరికొత్త ఆయుధాలను విదేశీయుల నుంచి వర్తకాలద్వారా కొన్నాడు. తన రాజ్యంలో బలాన్ని, బలగాన్ని ఉన్నతస్థాయిలో అభివృద్ధిపరచి పటిష్ఠం చేసుకున్నాడు.

ఉత్తర, దక్షిణ ప్రాంత భూ ఆక్రమణకై సాయుధులై సైన్యాన్ని తరలించుకుని మహామయుడు బయలు దేరుతున్నాడన్న వార్త వినగానే దేశంలోని రాజులంతా కంపించిపోయారు. తమ దేశాలపై దండెత్తి రావద్దని, రక్తపాతంతో పనిలేదని, సామంత రాజులుగా లొంగిపోతున్నామని, కోరినమేరకు కప్పం చెల్లిస్తుంటామని, చక్రవర్తిగా దేశాన్నేలుకొమ్మని సమస్త ప్రాంతాల నుండి వర్తమానాలు అందాయి.

మహామయుడు తన మాట ప్రకారంగా ఉత్తర దక్షిణ భూ ప్రపంచానికి చక్రవర్తి అయ్యాడు. కరుణావర్ధన మహారాజుకి ప్రణమిల్లి చక్రవర్తి స్థానంలో వ్యవహరించ వలసిందిగా కోరాడు.

కరుణావర్ధనుడు మహదానంద భరితుడై మహామయుడిని ఆలింగనం చేసుకుని దంపతులిద్దరినీ మనసారా ఆశీర్వదించాడు.

మహామంత్రి విజయవర్మను ఉద్దేశించి "బాగారా మహామంత్రీ!! మనదేశ ప్రగతి దశదిశలా ప్రాకిపోయింది. ఇంతటి విజయానికి కారకులైన రత్నగంధికి దక్కుతుంది కీర్తి. అందులో సమభాగం మన మహామయునికి కూడా! దానంటారా?"

దానికి మహామంత్రి "మహా ప్రభూ! మహామయునిలో అవలక్షణాలలో ఏ ఒక్కటి లేకపోగా, అతడు గొప్ప వివేకి, రాజనీతిజ్ఞుడు కూడా. సేనాధిపతిగా వ్యవహరించిన వాడికి దేశభక్తి, మాతృదేశంపట్ల ఎనలేని గౌరవం ఉంటే సరిపోదు. తన సైనికుల్ని మరింత సుశిక్షితులుగా తయారుచేయడమే గాక ఆయుధాల విషయంలో కూడా పైచేయిగా ఉండాలి. మహామయుడు ఇలువంటి పద్ధతుల ననుసరించి ఉండడంవల్లనే పొరుగుదేశాలు అతడు సేనాధిపతిగా కదనరంగంలో వున్నంతవరకు అతనితో యుద్ధం చేయడానికి ఎవరూ సాహసించరు. సాధారణంగా యుద్ధంలో పెద్ద నష్టంతో వచ్చిపడే విజయం సాధించడంకన్నా అసలు శత్రువులు దండెత్తివచ్చేందుకే జంకేలా చేయగలవాడే సమర్థుడయిన వాడు. ఆ పని మహామయుడు చేయగలిగాడు" అన్నాడు సభాసదుల వంక చూస్తూ విజయవర్మ.

రత్నగంధి యుక్తికి, ఆమెకు దేశంపైగల అపారమైన భక్తి ప్రపత్తులకు... మహామయుడి శక్తికి, అతడిలోవున్న ఉన్నత గుణాలకు కరుణావర్ధనుడు మరియు రాయలసీమ ప్రజల జయజయ నాదాలతో వేనోళ్ల కొనియాడి పండుగ చేసుకున్నారు.

ఆమె ఆనందంగా నవ్వుతున్నంత కాలము రాయలసీమ రతనాల రాసులుగా విరజిమ్మబడ్డాయి.

*